153) గుండక్రియ/రాగమాలిక

ప|| హరిహరి నీమాయాజగ మిది అండనే చూచుచు నవ్వుచు |
అరసి యందులో నిను భావించేటిఆత్మ భావమిది యెన్నడొకో ||

చ|| సకలోద్యోగంబులు మాని సకలోపాయంబులు విడిచి |
సకలేంద్రియములజాలటు మాని సకలవిషయములరహితుడై |
సకలము దనవలె భావించి సర్వాంతరాత్మవు నిను దెలిసి |
అకలంకంబున నుండెడిభావం బది యిక నెన్నడొకో ||

చ|| ఘనమగు కోర్కుల జాలించి ఘనకోపంబు నివారించి |
ఘనకాముకత్వముల నటు దనిసి ఘనమగునాసల దొలగించి |
ఘనముగొంచముల నిను దలచి ఘనాఘనుడవు నీవనుచు |
అనుమానములటు సుఖియించే దది యిక నెన్నడొకో ||

చ|| పరచింతలలో దడబడక పరమార్గంబుల కగపడక |

***********************************************************************************************



***********************************************************************************************

పరహింసలకును యెన్నడు జొరక పరదూషణలకు నెడగిలిసి |
పరదేవుడ శ్రీవేంకటభూధరపతి నీకే శరణనుచు |
ఆరమరపులనే జొక్కితి తనిసే దది యికనెన్నడొకో ||